క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తంబళ్లపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు శనివారం పంపిణీ చేసినట్లు ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడులు తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో 20 వేల పుస్తకాలు, 19వేల నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు.

చదువుకున్న వ్యక్తి దేశానికి శక్తి

బి.కొత్తకోట: చదువుకున్న వ్యక్తి దేశానికి శక్తి అన్ని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. బాలికా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా బడిఈడు కలిగిన బాల బాలికలు అందరూ పాఠశాలలో ఉండాలన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటి పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలు చదువులో రాణించాలని కోరారు. ఇదే పాఠశాలలో 10 వతరగతి పరీక్షలలో జిల్లా మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో 5వ స్థానం సాధించారని గుర్తు చేస్తూ అదే స్ఫూర్తితో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని శైలజ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం



మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, అర్చకులు గోవర్ధనభట్టార్‌లు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ: ఫాదర్స్‌డే సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరీష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

పెద్దమండ్యం: మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని వడ్డివంకతండాకు చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై జరిగిన దాడి కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. గురువారం రాత్రి దిగువపల్లెకు సమీపంలో జరిగిన దాడిలో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రవినాయక్‌కు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. బాధితుడి తల్లి బుక్కే శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి చేసిన బండి జయమ్మ, ఈమె భర్త బండి రమణారెడ్డి అలియాస్ విశ్వనాథరెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే బండి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవినాయక్‌పైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వారపు సంత వేలం



వారపు సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

ములకలచెరువు: మండలంలోని బురకాయల కోటలో శనివారం వారపు సంతకు సంబంధించి వేలం పాట నిర్వహించారు. వేలంలో రూ.96,700లకు హెచ్చు పాటాదారుడైన విశ్వనాథ్ నాయుడు వారపు సంతను దక్కించుకున్నాడు. ఎంపీడీవో పోలప్ప, సర్పంచ్ వై.విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను బోధించండి


పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని ఎంఈఓ నారాయణ సూచించారు. శనివారం ఆయన మండలంలోని రంగసముద్రం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

లాటరీ టికెట్లు విక్రయించే వారిపై మూడు కేసులు

వాల్మీకిపురం: పట్టణంలోని లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తులపై మూడు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వర రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన గొడుగు రామాంజులు, వెంకటాచలపతి తదితర ఏడుగురుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా లాటరీ టికెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

డీఎస్పీ ప్రసాదరెడ్డి



మదనపల్లె: పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి



కలికిరి: ముస్లిం మత పెద్దలతో సీఐ మోహన్

మదనపల్లె : బక్రీద్ పండుగను ఈనెల 17న ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రసాదరెడ్డి, సబ్‌కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం సబ్ కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ముస్లిం మతపెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముస్లింలు బక్రీద్ పండుగ మతసామరస్య భావనతో జరుపుకోవాలన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గాల వద్ద ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మదనపల్లె పట్టణం మతసామరస్యానికి ప్రతీకగా ఉంటోందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాము పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.బక్రీద్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పీస్ కమిటీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఈద్గాలో సామూహిక ప్రార్థనలకు వచ్చేవారికి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వలీబాషు, అధికారులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : బక్రీద్ పండుగను ముస్లిం మైనారిటీ సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో హిందూ,ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోమవారం స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు, అల్లావుద్దీన్, గడీబాషా, రియాజ్, రమణ, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం

కలికిరి: ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని సీఐ ఆర్.మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని మసీదుల ముతవల్లీలు, మసీదు పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోవధ నిషేధమన్నారు. బక్రీద్ రోజున పోలీస్ నిఘా ఉంటుందని, ఎవ్వరూ నిబంధనలు అతిక్రమించకుండా మసీదు ముతవల్లీలు, మత పెద్దలు స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు.

ప్రజాసమస్యలపై రాజీపడే ప్రసక్తి లేదు

- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ప్రజలు కోరుకున్న విధంగా పరిపాలన అందించడమే తన ధ్యేయమని, ప్రజాసమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌వీఆర్ కల్యాణమండపంలో నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మండలపరిషత్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, విద్యుత్, రవాణా, ఫారెస్ట్, పబ్లిక్‌హెల్త్, హెచ్‌ఎన్‌ఎస్ అధికారులతో ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతిపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ప్రజలు తనతో ప్రస్తావించిన సమస్యలపై అధికారుల వివరణ అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి సంబంధించి తాను చేయాలనుకుంటున్న ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు. ప్రగతికి సంబంధించి అధికారుల సలహాలను స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేద్దామన్నారు. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంచాయతీల్లో నీటిసమస్య ఉందన్న ఫిర్యాదులు వినిపించకూడదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసైనా ప్రజలకు నీటిసరఫరా సక్రమంగా జరగాలన్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకానికి నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించేంది లేదన్నారు. నీటిసరఫరా విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ కనపరిచి, రెండురోజులకు ఒకసారి నీటిసరఫరా జరిగేలా చూడాలన్నారు. సాగు,తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా హంద్రీనీవా అనుసంధానంతో చిప్పిలి, గుట్టకింద పల్లె సమ్మర్ స్టోరేజీల నిర్మాణపనులు త్వరితగతిన చేయాలన్నారు. రెవెన్యూ, మండలపరిషత్ కార్యాలయాల్లో రైతుకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు, ఆర్ఓఆర్, 1బీలు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. బీకే.పల్లెలో హౌసింగ్‌కు కేటాయించిన ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణలు జోరందుకున్నాయన్నారు. రాత్రికి రాత్రే నిర్మాణాలు జరుగుతున్నాయన్న అధికారుల ఫిర్యాదుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ అధికారులను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ప్రతి ఆదివారం ఉదయం 6.30 నుంచి 9గంటల వరకు మొదటి విడతలో పదివేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుని, కార్యాచరణ ప్రారంభించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్‌లు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి డీపీఆర్ తయారు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల వరకే పార్టీలు, వర్గాలు అని, ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టాక, నియోజకవర్గ అభివృద్ధికి అందరినీ కలుపుకుని ముందుకు పోతానన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ నాగమల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్‌లు రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, ఎంపీడీఓలు భానుప్రసాద్, షాలెట్, ఏడీ దీక్షాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం-తల్లిబిడ్డకు ఆరోగ్యం క్షేమమని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యులు కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ చెరువుముందర పల్లెకు చెందిన గణేష్ భార్య జానకికి పురుటినొప్పులు రావడంతో ఎర్రకోటపల్లె పీహెచ్‌సికి తరలించారు. శనివారం తెల్లవారు జామున వైద్యుల సహాయంతో సిబ్బంది సాధారణ ప్రసవం చేసి, తల్లి బిడ్డకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వారిని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి చేర్చారు. జానకి దంపతులు వైద్యులకు, ఆరోగ్యసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం.. ద్రౌపది కల్యాణం



ద్రౌపది కల్యాణ ఘట్టంలో పాల్గొన్న భక్తులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పంచమవేద మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం ద్రౌపది కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం బంగారుపాళెంకు చెందిన భాగవతారిణి రెడ్డికుమారిచే «ద్రౌపది స్వయంవరం» హరికథా కాలక్షేపం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు స్థానిక చెన్నారెడ్డివీధికి చెందిన సాయిరాం నర్సరీ నిర్వాహకులు రెడ్డెమ్మ, రెడ్డెప్ప ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ద్రౌపది కల్యాణం నిర్వహించారు. పంచ పాండవులు, ద్రౌపది దేవి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ-1,-2 డిపోలలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. శాఖంవారిపల్లె సర్వీసు బస్సు సాయంత్రం కలికిరిలో దాని నిర్ణీత సమయం కంటే ముందుగా బయలుదేరకుండా చూడాలని కోరారు. రంగనాథపురం -కలకడ సర్వీసును షెడ్యూలు టైమింగ్స్ ప్రకారం తిప్పాలని, బాగా కనిపించేలా పెద్ద డెస్టినేషన్ బోర్డు పెట్టాలని తెలిపారు. సీటీఎం నుంచి మదనపల్లె చిత్తూరు బస్టాండు వరకు తిరిగేలా షటిల్ సర్వీసు తిప్పాలని కోరారు. తంబళ్లపల్లె మీదుగా ఎన్‌సి కుంట నడిచే సర్వీసును దండువారిపల్లెని టచ్ చేస్తూ సర్వీసు వెళ్లేలా తిప్పాలని కోరారు. సీటీఎం-మదనపల్లె షటిల్ సర్వీసులను నడుపుటకు జిల్లా అధికారుల అనుమతి కోరుతామని, మిగిలిన అంశాలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్‌సి కుంట సర్వీసుకు ఒకసారి రూట్ సర్వే చేసి టైమింగ్ సెట్ చేసి ఉన్నతాధికారుల అనుమతితో దండువారిపల్లె టచ్ అయ్యేలా తిప్పుతామని తెలిపారు.

ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు

–జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

కలకడ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందించి, ఉత్తమ విద్యాబోధన చేయడమే ఉపాధ్యాయుల లక్ష్యంగా పనిచేయాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం పంపిన పాఠ్యపుస్తకాలు, విద్యార్థి కిట్‌ను అందజేశారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి గత ఏడాది 10వ తరగతిలో 92 శాతం ఉత్తీర్ణత సాధించడం గొప్పవిషయమన్నారు. ఈ ఏడాది కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రతి తరగతి గదిలో గాలి, వెలుతురు, నీటి సౌకర్యం వంటివి కల్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల జాతీయర హదారి పక్కనే ఉన్న కారణంగా ఉదయం, సాయంత్రం ప్రమాదాల నివారణకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈఓ రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి రెడ్డి, ఉపాధ్యాయులు వైవి రమణ పాల్గొన్నారు.

అంగళ్లు గొర్రెల సంత కిటకిట



కొనుగోలు దారులతో సందడిగా అంగళ్లు సంత

కురబలకోట: బక్రీద్‌ను పురస్కరించుకుని అంగళ్లలో శనివారం జరిగిన గొర్రెల సంత కిటకిటలాడింది. ప్రతి శనివారం ఇక్కడ గొర్రెల సంత నిర్వహిస్తారు. బక్రీద్‌కు ఇక్కడికి ప్రత్యేకంగా మేపిన భారీ పొట్టేళ్లు, మేకపోతులను సంతకు తీసుకు వస్తారు. రాయలసీమ జిల్లాల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి ఇక్కడికి పొట్టేళ్లు, మేకపోతులు వచ్చాయి. పరిసర ప్రాంతాల వారితో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతానికి చెందిన వ్యాపారులు తరలి వచ్చారు. పండగ ముందు సంత కావడంతో వీటి రేట్లు అబ్బా అన్పించాయి. కాశ్మీరి జాతి మేక పోతు ఏకంగా రూ. 95 వేల నుంచి రూ.లక్ష దాకా పలికాయి. వీటిని మదనపల్లెకు చెందిన వారు ప్రత్యేకంగా వాహనంలో తీసుకు వచ్చారు. సంతకే ఇవి హైలెట్‌గా నిలిచాయి. కొమ్ములు తిరిగిన పొట్టేళ్లకు డిమాండు ఏర్పడింది. ముఖ్యంగా బక్రీద్‌కు మేకపోతులను ఎక్కువగా కొనుగోలు చేశారు. రూ.35 వేల నుంచి రూ. 60 వేల వరకు జాతి, సైజును బట్టి రేట్లు పలికాయి. సంతలో దళారులకు పంట పండింది. ఈ సంతలో శనివారం ఒక్క రోజే రూ. కోట్లలో వ్యాపార లావాదేవీలు జరిగి ఉంటాయని వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.. ప్రతి ఏటా బక్రీద్ పండుగకు ముందు జరిగే సంత జోరుగా సాగుతుంది.

నిబంధనలు పాటించని

స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

పీలేరు రూరల్ : పీలేరులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ డిమాండ్ చేశారు. శనివారం ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) గుర్తింపు లేకపోయినా సీబీఎస్ఈ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్‌కుమార్, ఇమ్రాన్, అఖిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన

కలకడ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన సాధ్యమని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయుడు అన్నారు. శనివారం మండలంలోని బంగారువాండ్లపల్లె, తిప్పిగారిపల్లె, గుడిబండ గ్రామాలలో పర్యటించి ఉన్నత పాఠశాల కోనలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేసి పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు కోసం గ్రామాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, ,ఉపాధ్యాయుల అంకిత భావం, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, రుచికరమైన మధ్యాహ్న భోజనం, క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ, పాఠశాలలోని సౌకర్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆపాఠశాల ఉపాధ్యాయులు శివారెడ్డి, మహేశ్వరి, రమేష్‌రెడ్డి, నాగమునినాయక్, గఫార్‌ఖాన్, సైరాభాను, నౌషాద్‌బేగం, రూన్సీరాణి, కిరణ్ కుమార్, షౌకత్‌అల్లీ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

పీలేరు : కేన్సర్ నివారణపై అవగాహ కలిగి ఉండాలని ప్రభుత్వాస్పత్రి డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు, శిక్షణ పొందుతున్న డాక్టర్స్ పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా, సంపూర్ణంగా నయము చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సీహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జిలు విజయ్‌కుమార్‌రెడ్డి, శిరీష

మదనపల్లె : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి బి.అబ్రహం సూచనల మేరకు ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్‌రెడ్డి, రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బి.శిరీష తెలిపారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి పోలీస్‌అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీపడేలా చూడాలన్నారు. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని, లోక్‌అదాలత్ తీర్పు అంతిమమన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కలిగించాలన్నారు.

ప్రతి ఒక్కరికీ బీసీజీ టీకాలు

–డివిజనల్ టీబీ అధికారి శ్రీధర్



జనుపువారిపల్లెలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బి.కొత్తకోట: బీసీజీ టీకాలు అందరికి వేయాలని డివిజనల్ టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శనివారం బి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో పెద్దతిప్పసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబధించిన ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లతో శ్రీధర్ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీకా కార్యక్రమంతో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. ఈ టీకా ఎంతో సురక్షితమని , టీకా మీద ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలను కోరారు. అనంతరం బీసీజీ టీకా కార్యక్రమాన్ని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, అలేటివారిపల్లిలో తనిఖీ చేశారు. సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది, సంబంధిత గ్రామ పంచాయితీ అధికారులను, అంగన్వాడీ సిబ్బంది, టీబీ ఛాంపియన్ సమన్వయ పరుచుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, పి.టి.ఎమ్ ఆరోగ్య కేంద్రము డాక్టర్ ఎస్థాని , సబ్ యూనిట్ ఆఫీసర్ ఖలీల్, సూపర్ వైజర్ విజయ కుమారి, రెడ్డెప్ప, మదనపల్లె టిబి విభాగం సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుశీల, వనజకుమారి, సునీత పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నివారణ

వాల్మీకిపురం: క్షయ వ్యాధి లేని సమాజ లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని డాక్టర్ శ్రీవిద్య అన్నారు. మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని మూరేవాండ్లపల్లి గ్రామంలో శనివారం ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వయోజన టీకా చాలా సురక్షితమైందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పి పుష్ప, వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు/ కలికిరి : ఆక్రమణలకు పాల్పడిన నాయకులు, వారికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నగిరిపల్లెలో ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారీగా అవకతవకలు జరిగాయని తెలిపారు. ఇంటి ప్లాన్ అప్రూవల్‌కు బ్యాంకుల్లో చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, గ్రామ పంచాయతీలో ఇష్టాను సారంగా నగదు లావాదేవీలు జరిపి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. నాయకుల అనుచరుల పేరుతో కార్యాలయంలో పని చేస్తున్నట్లు నమోదు చేసుకుని 20 మంది పేర్లతో జీతాలు స్వాహా చేశారని తెలిపారు. వేరే మండలంలో కాపురం ఉంటూ పీలేరు మండలంలో చెరువు, గుట్ట, కాలువ, పరంబోకు, ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా ఇండ్లు నిర్మించుకుని పొజిషన్ సర్టిఫికెట్లు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దివంగత ఎన్టీఆర్ రైతులను దృష్టిలో ఉంచుకుని పీలేరులో ఆయిల్‌మిల్ కోసం భూములు కేటాయిస్తే జగనన్న కాలనీ పేరుతో దర్జాగా ఇంద్ర భవనాలు నిర్మించారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే సర్వే నెంబర్‌పై డీకేటీ భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నట్లు తెలిపారు. ఏపీఐఐసీ లేఅవుట్‌లో విశ్వబ్రాహ్మణులకు అనుమతులు లేకుండా ఆరు నుంచి ఏడు ఎకరాల వరకు కట్టబెట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. ఆర్ అండ్ బీ జాగాల్లో అక్రమ కట్టడాలు మీకు కనిపించలేదా అని అధికారులను ప్రశ్నించారు. ఆక్రమణలకు పాల్పడిన నాయకులు, వారికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ రోడ్డును దున్నేశారు

–మూడేళ్లుగా తీరని రోడ్డు వివాదం



గొడసానిపల్లె వద్ద దున్నివేసిన రోడ్డు

కురబలకోట: మండలంలోని గొడసానిపల్లె వద్ద మూడేళ్లుగా పొలానికి వెళ్లే రోడ్డు సమస్య తీరడం లేదు. ఇప్పటి వరకు మూడు సార్లు రోడ్డును దున్నేశారు. వివాదాస్పదంగా మారిన ఈ రోడ్డును శనివారం మరోసారి దున్నేశారు. ఇక్కడ మట్లివారిపల్లెకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులకు, ఆర్సీ కురవపల్లె, గొడసానిపల్లెకి చెందిన టీడీపీ నాయకులకు భూములున్నాయి. ఇదివరలో ప్రత్యర్థులు దున్నేసిన రోడ్డును టీడీపీకి చెందిన ఆర్. బాలకృష్ణ ఇటీవల సొంత నిధులతో మళ్లీ రోడ్డు వేసుకున్నారు. ఈ రోడ్డుకు మొదటి భాగంలో వైఎస్సార్ సీపీకి చెందిన రైతుల భూములున్నాయి. తమ పొలంలో వేసిన రోడ్డును వారు మరోసారి శనివారం దున్నేశారు. దీంతో ఈరోడ్డు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. రోడ్డు వేసిన భూమి డీకేటీదని ప్రజోపయోగం దృష్ట్యా దారి వదలాలని బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు ఇదివరలో వినతి పత్రం ఇచ్చారు. తమ అనుభవంలో ఉన్న భూమి కావడంతో రోడ్డు వదలబోమని వైఎస్సార్ సీపీ రైతులు చెబుతున్నారు. దీంతో ఈ సమస్య ఎటూ లేలక వివాదాస్పదంగా మారింది. వాళ్ల రోడ్డు వేయడం ప్రత్యర్థులు తిరిగి దున్నేయడం పరిపాటిగా మారుతోంది. అధికారులు రోడ్డు సమస్యపై పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

